క్లుప్తంగా

నేడు వీఎంసీ పీజీఆర్ఎస్ రద్దు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థలో ఈ నెల 20వ తేదీ సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదులు–పరిష్కార(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని దీపావళి పండుగ సందర్భంగా రద్దు చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాలు సచివాలయాల్లో జరిగే ఈ కార్యక్రమం జరగదన్నారు. నగర వాసులు గమనించి సహకరించాలని కోరారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): మనలోని ఆలోచనలు, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తి విద్యకు మాత్రమే ఉందని ఎస్ఆర్ జూనియర్ కాలేజీల ఏపీ జనరల్ మేనేజర్ ఒ.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. గొల్లపూడిలోని ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. అనంతరం మెరిట్ విద్యార్థులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఫ్రెషర్స్ డే వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన భరత నాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలు అలరించాయి. అలాగే కోలాటం, మిమిక్రీ, మోడరన్ మిక్సింగ్ సాంగ్స్, ఏకపాత్రాభినయం, గిటార్, స్కిట్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏపీ డీజీఎం జీవీ రమణ, అకడమిక్ డీన్ జి.అరవింద్, విజయవాడ జోనల్ ఇన్‌చార్జ్‌లు పి.కృష్ణారావు, టి.నాగరాజు, కె.మహేంద్ర రెడ్డి, విజయవాడ అకడమిక్ డీన్ పి.శంకరరావు, ఎస్ఆర్ జూనియర్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మే 30వ తేదీన కాశేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో ఒక వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, స్పృహ తప్పి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని పేరు సూరమళ్ల రాజు (55)గా తెలిసింది. అయితే ఆ వ్యక్తి ఈ నెల 18వ తేదీన చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ప్రభుత్వాసుపత్రి నుంచి వన్‌టౌన్ పోలీసులకు సమాచారమందింది. అతని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆ వ్యక్తి తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సీఐ గురుప్రకాష్ కోరారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.





నగరంలో దీపావళి సందడి





నగరంలో దీపావళి పండుగ సందడి నెలకొంది. ఘంటశాల సంగీత కళాశాల, మాకినేని బసవపున్నయ్య స్టేడియం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బాణ సంచా దుకాణాలతో పాటు ప్రధాన కూడళ్లలో ప్రమిధలు విక్రయాల వద్ద ఆదివారం కొనుగోలుదారుల సందడి కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

విద్యార్థులు సృజనాత్మకతకు పదును పెట్టాలి

ఎస్‌సీఈఆర్టీ సంస్థ డైరెక్టర్ కృష్ణారెడ్డి



విజేతలతో అతిథులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమలోని సృజనాత్మకశక్తికి పదును పెట్టాలని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్టీ) సంస్థ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి అన్నారు. ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు ఆంధ్ర లయోలా కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. క్వాంటమ్ ఏజ్ బిగిన్స్ – పొటెన్షియల్స్ అండ్ ఛాలెంజస్ అంశంపై ఈ సెమినార్ పోటీలను నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థి ఈ నెల 30న బెంగుళూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారని తెలిపారు. విజయనగరం జిల్లాకు చెందిన పి.భానుప్రసాద్ ప్రథమ, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన బి.ఉషాకిరణ్మయి ద్వితీయ, ఏలూరు జిల్లాకు చెందిన దివ్యశ్రీ తృతీయ బహుమతిని సాధించారు. కార్యక్రమంలో అధికారులు డాక్టర్ నాగమణి, డాక్టర్ పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో వైద్య రంగం నిర్వీర్యం

45వ డివిజన్‌లో కోటి సంతకాల సేకరణ



45వ డివిజన్‌లో సంతకాలు చేస్తున్న ప్రజలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజా వైద్యం ప్రజల హక్కని, అటువంటి ప్రజారోగ్య రంగాన్ని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్ సీపీ 45వ డివిజన్ ఇన్‌చార్జ్ సరగడ శంకరరెడ్డి విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు సూచనలతో స్థానిక 45వ డివిజన్ పరిధిలోని కబేళా రోడ్డు, జోజినగర్ కరెంట్ ఆఫీస్ రోడ్డులో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సరగడ శంకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఒక బోధనాసుపత్రి ఉండాలన్న సంకల్పంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను తెచ్చారని వివరించారు. అయితే కూటమి ప్రభుత్వం ఆ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేస్తూ తమ బినామీలకు దారాదత్తం చేస్తోందని విమర్శించారు. ప్రజల ఆస్తులు ఎప్పటికీ వారికే చెందాలన్నది జగనన్న ఆకాంక్ష అని తెలిపారు. ప్రతి పౌరుడు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బోర మల్లేశ్వరరెడ్డి, సుంకర నారాయణ, గుండు శ్రీనివాసరావు, చల్లారావు, ముత్తా వాసు, దుర్గా రెడ్డి, కేదారి ప్రసాద్, రవ్వ కోటేశ్వరి, దుర్గా భవానీ, ఉండబట్ల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ చిన్ని అవినీతిపై చంద్రబాబు సమాధానం చెప్పాలి

వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్

వించిపేట(విజయవాడపశ్చిమ): జిల్లాలో ఇసుక, రేషన్ మాఫియాను పెంచి పోషిస్తున్నది విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అని మరోసారి రుజువు అయ్యిందని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్రమార్జనలో ఎంపీ చిన్ని దూసుకువెళ్తున్నారని తాము ముందు నుంచి చెబుతున్నామన్నారు. అందుకు తగినట్లుగానే నేడు టీడీపీకి చెందిన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ ఎంపీ అవినీతిని బహిర్గతం చేశారని తెలిపారు. ఇసుక, రేషన్ మాఫియా నుంచి పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు అమ్ముకోవడం వరకూ దేనినీ వదలకుండా ఎంపీ అవినీతి చేస్తున్నారని సొంత పార్టీ కార్యకర్తల ముందే బహిరంగంగా కొలికపూడి వ్యాఖ్యానిస్తున్నారంటే ఆయన అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందన్నారు. ఇటీవల విజయవాడ ఉత్సవ్‌లో పెద్ద ఎత్తున దండుకున్నారనే ఆరోపణలు మరువక ముందే, నేడు స్వయానా సొంత పార్టీ ఎమ్మెల్యే ఎంపీ అవినీతిపై బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారంటే ఇది చాలా తీవ్రమైన విషయమన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ప్రజలకు సమాధానం చెప్పాలని గౌస్ మొహిద్దీన్ డిమాండ్ చేశారు. లేకుంటే ఎంపీ చిన్ని అవినీతిలో చంద్రబాబు, లోకేష్‌లకు వాటా ఉందన్ని భావించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం

వీధుల్లో గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్న కుక్కలు



గొల్లపాలెంగట్టు రోడ్డులో సంచరిస్తున్న వీధికుక్కలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయం... చేతిలో సంచితో ఒంటరిగా కనిపిస్తే వెంటపడి వెనుక పరుగులు పెట్టిస్తున్నాయి. ఇలాంటి ఘటనలు పశ్చిమలోని పలు వీధుల్లో సర్వ సాధారణమయ్యాయి. పశ్చిమంలోని కొత్తపేట, గొల్లపాలెంగట్టు, వించిపేట, చిట్టినగర్, కేఎల్‌రావునగర్, సిండికేట్ బ్యాంక్ కాలనీ, రాజీవ్‌శర్మ నగర్, వాగు సెంటర్ ఇలా ఒకటేమిటి.. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా వీధి కుక్కలే దర్శనమిస్తున్నాయి. చేతిలో సంచిలో ఏ మాత్రం వాసన వచ్చినా అవి మీద పడి గాయాలు చేస్తున్నాయి. ఆదివారం పిల్లాపాపలతో మార్కెట్‌కు వెళ్లాలన్నా.. వీధి చివర ఉన్న కిరాణా కొట్టుకు వెళ్లాలన్నా భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఒకటి రెండు వీధులకే పరిమితమైన వీధి కుక్కలు ఇప్పుడు ప్రతి డివిజన్‌లోనూ కనిపిస్తున్నాయి. కార్పొరేషన్ అధికారులకు వీధి కుక్కలను అరికట్టాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కలను నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నయనానందంగా దీపాకృతులు

- ఆకట్టుకుంటున్న విభిన్న ప్రమిధలు
- పలు రకాల ప్రమిధలను విక్రయిస్తున్న తమిళ తంబీలు





వివిధ రూపాల్లో తయారు చేసిన ప్రమిదలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ మార్కెట్‌లో వివిధ ఆకృతుల్లో లభిస్తున్న ప్రమిధలు ఆకట్టుకుంటున్నాయి. దీపావళి అంటేనే దీపాల వరస అని పేర్కొంటారు. అటువంటి పండుగ రోజున వెలిగించే దీపాలకు ప్రత్యేకంగా ప్రమిధలను విక్రయిస్తున్నారు. గతంలో మట్టి ప్రమిధలనే వినియోగించేవారు. రానురాను ప్రమిధలు సరికొత్త హంగులను అద్దుకుంటున్నాయి. పాతబస్తీలోని కాశేశ్వరరావు మార్కెట్ పరిసర ప్రాంతాల్లో వివిధ రూపాల్లో మట్టి ప్రమిధలు అలరిస్తున్నాయి.

విభిన్న ఆకృతుల్లో..

విభిన్న ఆకృతుల్లో లభిస్తున్న ప్రమిధలు వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. లక్ష్మీగణపతి, గణపతి, కలశం, శంఖు చక్రం, కొబ్బరికాయ, పాతకాలం నాటి కిరోసిన్ బుడ్డి దీపం, తులసీకోట తదితర విభిన్న ఆకృతుల్లో ఈ ప్రమిధలు కనువిందు చేస్తున్నాయి. ప్రమిధల ఆకృతిని బట్టి రూ.50ల నుంచి రూ.450లు వరకూ ధరలు పలుకుతున్నాయి. వీటి కొనుగోలుకు వినియోగదారులు ప్రాధాన్యతమిస్తున్నారు. మరోపక్క విద్యుత్ దీపాలు ప్రత్యేక ఆకర్షణ నిలుస్తున్నాయి.

తమిళ తంబీల విక్రయాలు

ప్రధానంగా తమిళనాడుకు చెందిన పలు కుటుంబాలు దీపావళి పర్వదినానికి వారం పది రోజులు ముందుగా నగరానికి వచ్చి చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా కుటుంబాలు నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ విధమైన విభిన్న ఆకృతుల్లో ప్రమిదలను విక్రయిస్తున్నారు. ప్రధానంగా కాశేశ్వరరావు మార్కెట్ సమీపంలో తమిళ కుటుంబాలు వివిధ ఆకృతుల్లో ప్రత్యేకంగా తయారు చేసిన ప్రమిధల విక్రయాలను జరుపుతున్నారు.

సూపర్‌స్టార్ కృష్ణకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించాలి



జ్ఞాపికలతో కృష్ణ అభిమానులను సత్కరించిన సుధాస్వామి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సినీనటుడు, సూపర్ స్టార్ కృష్ణకు కేంద్ర ప్రభుత్వం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును ప్రకటించాలని ఆయన అభిమానులు డిమాండ్ చేశారు. అవార్డు ప్రకటించాలని కోరుతూ ఆదివారం విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీసాయిబాబా, నాగ మానసాదేవి ఆలయంలో కృష్ణ అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి అభిమానులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలిండియా సూపర్‌స్టార్ కృష్ణ–మహేష్ బాబు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాస్వామి మాట్లాడుతూ.. కృష్ణ నటుడిగా, నిర్మాతగా తెలుగు చలన చిత్ర పరిశ్రమకు కొత్త సొబగులు అద్దారన్నారు. కోట్లాది మంది అభిమానుల అభిమానాన్ని చూరగొన్న కృష్ణకు కేంద్ర ప్రభుత్వం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించడం సముచితమన్నారు. ఆ దిశగా కేంద్రం ఆలోచన చేయాలని కోరారు. రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. అనంతరం కృష్ణ అభిమానులను సత్కరించి, వారికి జ్ఞాపికలు అందజేశారు.

కొండప్రాంతంలో జారిన రిటైనింగ్ వాల్



జగుపిల్ల రామారావువీధి కొండ ప్రాంతంలో జారిన రిటైనింగ్ వాల్

వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 49వ డివిజన్ కొండప్రాంతంలో వర్షానికి రిటైనింగ్ వాల్ జారి కింద నివాసాలపై రాళ్లు, మట్టిచరియలు పడ్డాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కొండ ప్రాంతంలోని జగుపిల్ల రామారావువీధిలోని తంగిరాల వరలక్ష్మి ఇంటి ముందు ఉన్న రిటైనింగ్ వాల్ వర్షానికి నాని ఆదివారం తెల్లవారుజామున పెద్ద శబ్దంతో కొండరాళ్లు, మట్టిచరియలు జారి కింద ఉన్న నివాసంపై పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఇదే తరహాలో వర్షం పడితే రిటైనింగ్ వాల్ పూర్తిగా జారిపోయి పెద్ద ప్రమాదాలే చోటుచేసుకునే అవకాశం ఉందని స్థానికులు భయందోళ వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో కూడా వర్షాలకు ఇదే డివిజన్‌లోని రెండు ప్రాంతాల్లో రైటైనింగ్ వాల్స్ కూలిన సంఘటలో రెండు ఇళ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. దీనిపై ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు దృష్టిసారించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్గగుడిలో రద్దీ సాధారణం



మహా నివేదన సమయంలో క్యూలైన్‌లో అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు


ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం రద్దీ సాధారణంగా కనిపించింది. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, ఖడ్గమాలార్చన అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతించారు. శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రద్దీ సాధారణంగా ఉందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల తర్వాత వర్షం కాసింత తగ్గుముఖం పట్టడం, ఆ తర్వాత సాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. మధ్యాహ్నం 11 గంటల తర్వాత క్యూలైన్‌లో కాస్త రద్దీ కనిపించి భక్తులతో కిటకిటలాడాయి. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో క్యూలైన్‌లో భక్తులు బారులు తీరి కనిపించారు. మహా నివేదన అనంతరం మధ్యాహ్నం 12–20 గంటలకు దర్శనాలు తిరిగి ప్రారంభం కాగా, మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆలయ ప్రాంగణంలో భక్తుల తాకిడి కనిపించింది.

నగరంలో అనధికార బాణసంచా దుకాణాలు

- సంగీత కళాశాలలో 15 దుకాణాలకే అధికారుల అనుమతి
- అనధికారకంగా మరో 10 దుకాణాల ఏర్పాటు
- ఒక్కో దుకాణానికి రూ.1.50 లక్షల వరకు వసూలు
- అధికార పార్టీ నేత కనుసన్నల్లోనే దోపిడీ



విజయవాడ ఘంటశాల మ్యూజిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు



15 దుకాణాలకు అనుమతిస్తూ అధికారులు ఇచ్చిన లే అవుట్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అధికార పార్టీ చోటా మోటా నాయకులు దీపావళి బాణసంచా దుకాణాలను కూడా తమ సంపద సృష్టికి వాడుకుంటున్నారు. నిబంధనలు పక్కన బెట్టి ఇష్టానుసారం షాపులు ఏర్పాటు చేయించి డబ్బులు దండుకుంటున్నారు. దీపావళిని దృష్టిలో పెట్టుకుని గత వారం రోజులుగా జిల్లా కలెక్టర్ నుంచి దిగువ స్థాయి వరకు అధికారులు చేస్తున్న సూచనలు, హెచ్చరికలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. నగరంలో మాకినేని బసవపున్నయ్య స్టేడియం, దుర్గాపురంలోని ఘంటశాల సంగీత కళాశాలలో బాణసంచా దుకాణాలకు అధికారులు అనుమతులు జారీ చేశారు. అయితే సంగీత కళాశాలలో కేవలం 15 దుకాణాలకు మాత్రమే అనుమతించారు. దుకాణాలు ఏ విధంగా ఏర్పాటు చేయాలో లే అవుట్ వేసి మరీ అనుమతులు మంజూరు చేశారు. కళాశాలలోని కళావేదికకు ఎడవ వైపు 10 దుకాణాలు, కుడి వైపున 5 దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు ఆదేశాలిచ్చారు. అధికారుల నుంచి అనుమతి తీసుకున్న వ్యాపారులు ఆ విధంగానే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు..

కానీ ప్రజాప్రతినిధి అండతో కొందరు అక్రమ దుకాణాలు ఏర్పాటు చేశారు. అధికారకంగా అనుమతిచ్చిన 15 దుకాణాలు కాకుండా అదనంగా మరో 10 దుకాణాలు ఏర్పాటు చేశారు. అవి ఎక్కడా కూడా నిబంధనలకు అనుగుణంగా లేవు. అనుమతి పొందిన దుకాణదారులు ప్రతి దుకాణం ఎదురుగా ఇసుక, వాటర్ డ్రమ్ములు ఏర్పాటు చేశారు. ఫైర్ సేఫ్టీ సామగ్రిని ఏర్పాటు చేసుకున్నారు. అధికార పార్టీ నాయకుల అడ్డంతో అడ్డగోలుగా ఏర్పాటు చేసిన దుకాణాలు ఫైర్ సేఫ్టీ సామగ్రి మచ్చుకు కూడా కనిపించడం లేదు. వీటిని కళాశాల ప్రహరీ పక్కనే ఏర్పాటు చేశారు. గోడకు మరోవైపున నివాస గృహాలు ఉన్నాయి. అనుమతి పొంది ఏర్పాటు చేసిన దుకాణాలకు ఎదురుగా ఏర్పాటు చేశారు. బాణసంచా విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలను తప్పకపాటించాలని కలెక్టర్ ఇప్పటికే అనేక పర్యాయాలు హెచ్చరించారు. కానీ ఇక్కడ నిబంధనలు పట్టించుకున్న పాపాన పోలేదు. కళాశాల మైదానంలో పోలీసులు, వివిధ శాఖల అధికారులు ఉన్నా .. అనుమతి ఎన్ని దుకాణాలకు ఇచ్చారు? వాస్తవంగా అక్కడ ఎన్ని దుకాణాలు ఏర్పాటు చేశారు? ఏ దుకాణాలకు అనుమతి ఉంది? ఏ దుకాణాలకు అనుమతి లేదనే విషయాలను పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఒక్కో దుకాణానికి మధ్య 3 మీటర్ల దూరం ఉండాలి. దుకాణాలు ఎదురెదురుగా ఉండకుండా చూడాలని, రెసిడెన్షియల్ ఏరియాకు కనీసం 50 మీ. దూరంలో మాత్రమే దుకాణాలకు అనుమతివ్వాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ సంగీత కళాశాలలో గోడకు వైపు బాణసంచా దుకాణాలు, మరో వైపు నివాస సముదాయలు ఉన్నాయి. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మైదానం పూర్తిగా బురద కయ్యగా మారింది. విద్యుత్ వైర్లు తేమగా ఉన్న నేలపైనే వేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని దుకాణాలకు వచ్చే జనం నిలదీస్తున్నారు.

వ్యాపారుల మధ్య ఘర్షణ..

ఈ దుకాణాల ఏర్పాటుకు అధికార పార్టీకి చెందిన నాయకుడు ఒకరు ఒక్కో దుకాణం నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేశారని ప్రచారం జరుగుతోంది. ఎవరితో పనిలేదని అంతా తామే చూసుకుంటామని చెప్పి మరీ అనధికారకంగా దుకాణాలు ఏర్పాటు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అనుమతులు పొంది దుకాణాలు ఏర్పాటు చేసిన వారికి, అనధికార దుకాణదారులకు మధ్య వివాదం కూడా రేగింది. అనుమతి పొందిన వారి దుకాణాలు ముందు గొడవలు చేసి అనధికార దుకాణాలకు వద్దకే జనాలు వెళ్లేలా కుట్ర జరుగుతుందని వ్యాపారులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అనధికార దుకాణాలను తొలగించాలని కోరుతున్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటుకు అధికార పార్టీ నేత ఒకరు ఒక్కో దుకాణం నుంచి రూ. 80 వేలు వసూలు చేశారని ప్రచారం జరుగుతోంది. అడిగినంత ఇవ్వకపోతే తెచ్చిన స్టాక్ పాడైపోతుందని నగదు ముట్టజెప్పినట్లు స్టేడియంలో దుకాణం ఏర్పాటు చేసిన ఓ వ్యాపారి తెలిపారు. వీధి పక్కన తోపుడు బండిపై బాణసంచా అమ్మేవారిని కూడా వదిలి పెట్టలేదని చెబుతున్నారు.

సమస్యలపై ఐక్యంగా పోరాటం చేద్దాం..

కృష్ణలంక(విజయవాడతూర్పు): కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య ఉద్యమాలకు సన్నద్ధం కావాలని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక రాణిగారితోటలోని వీఎంసీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సీఐటీయూ తూర్పు నగర 16వ మహాసభ జరిగింది. శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ కార్మికుల హక్కులను, సంక్షేమాన్ని కాలరాస్తోందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేయాలని చెప్పారు. కార్పొరేట్ సేవలో మోడీ ప్రభుత్వం తరిస్తూ అడవులు, పోర్టులు, ఖనిజ సంపదను అదానీ, అంబానీలకే కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.